క్లుప్తంగా

వరికోతల్లో జాగ్రత్తలు పాటించాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్



కోతలను పరిశీలిస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం సికింద్లపూర్ గ్రామ శివారులో చేపట్టిన వరికోతలను సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ పరిశీలించారు. ఆర్పీఎం 18 కంటే ఎక్కువ ఉన్నట్లయితే పాలను నివారించవచ్చని రైతులకు సూచించారు. కోతల విషయంలో జాగ్రత్త వహించాలని అన్నారు. అనంతరం చందాపూర్ గ్రామ శివారులోని పత్తిమిల్లును సందర్శించి పత్తి కొనుగోలు అక్కడి పరిశ్రమ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణీత ధరలకే కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఇన్‌చార్జి ఏడీఏ ప్రవీణ, ఏవో శ్రీనివాస్ ఉన్నారు.

కేతకీలో ప్రత్యేక పూజలు



జగదీశ్వర్‌ను సన్మానించిన అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి జగదీశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం సోమవారం పురస్కరించుకుని ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, మహామంగళ హారతి తదితర పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీసీ వసతి గృహ సంక్షేమాధికారి శారద, నాయకులు దత్తు, శివకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంపై చిన్న చూపు తగదు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై చిన్న చూపు చూస్తోందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మెట్రో రైలు పొడగింపులో కేంద్ర ప్రభుత్వం వాటా 18 శాతం మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంపై నిర్లక్ష్య ధోరణి వీడాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి మతిన్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యువరాజ్ మోరే, సాయిలు ముదిరాజ్, రతన్‌సింగ్, అక్షిట్ ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల డబ్బులు చెల్లించండి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

నారాయణఖేడ్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఎల్‌ఓలుగా విధులు నిర్వహించిన డబ్బులు చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు సోమవారం ఖేడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికలు ముగిసి 10 నెలలు దాటినా డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు అర్జున్, అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు నాగేశ్వరి, బాధ్యులు అనురాధ, బసంతి, మంగళ, భాగ్య, స్వరూప, వీరమణి, కమల, సుశీల పాల్గొన్నారు.

పాలకవర్గాన్ని ప్రకటించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని వెంటనే ప్రకటించాలని మండల బీజేపీ అధ్యక్షుడు దశరథ్ కురుమ డిమాండ్ చేశారు. ఖేడ్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చైర్మన్ పదవీ రిజర్వు కావడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 11నెలలు గడుస్తున్నా పాలకవర్గాన్ని ప్రకటించలేదని విమర్శించారు. దళితులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే కార్యవర్గాన్ని ప్రకటించాలన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

- అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్
- ప్రజావాణికి 46 దరఖాస్తులు

సంగారెడ్డి జోన్: ప్రజావాణి అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని ఆయా ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను అర్జీలు ద్వారా అందజేశారు. 46 ఫిర్యాదు అందాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, వాటిని పర్యవేక్షించడం, సకాలంలో పరిష్కరించడం తప్పనిసరి అని సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను శాఖల పరంగా అధికారులు తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఏ శాఖ అయినా తమకు సంబంధించిన సమస్యలపై సత్వరమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ పద్మజరాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

వేతనాలు అందించండి

సంగారెడ్డి మండలంలోని కల్పగూర్ గ్రామ పంచాయతీలో గత కొన్ని సంవత్సరాలుగా పారిశుద్ధ్య పనులు చేస్తున్నాం. నాలుగు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని, తమకు వేతనాలు ఇప్పించాలి.

డబ్బులు ఇప్పించండి



మాది గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామం. నా భర్త 11 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. నాకు ముగ్గురు కుమారులు ఉన్నారు. నా భర్త మరణం తర్వాత నాపెద్ద కుమారుడు ఇంటి వద్ద ఉంటున్నాను. సూరారంలో ఉంటున్న నా మూడవ కుమారుడు కొక్కొండ దశరథ్ ఇంటికి వచ్చి, నాపై దాడి చేసి జమ చేసుకున్న డబ్బులతో పాటు క్రాప్‌లోన్ ద్వారా వచ్చిన డబ్బులు, రెండు తులాల బంగారం లాక్కెళ్లాడు. నా కుమారుడుపై అధికారులు చర్యలు తీసుకుని డబ్బులతో పాటు బంగారం, తిరిగి ఇప్పించి, జీవనాధారం కోసం ప్రతి నెల రూ. 3వేలు ఇప్పించి, ఆదుకోవాలన్నారు. –కొక్కొండ పోచమ్మ, కొత్తపల్లి

వివాదాస్పద భూమిని సర్వే చేయండి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని సర్వే నంబర్ 58లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వేనంబర్ 1లో మిషన్ భగీరథ ట్యాంక్, శివాలయం హెచ్ఎండీఏ స్థలాల్లోకి వెళ్లే రహదారి పక్కన ఉన్న 58లోని పట్టాదారులు ఆ భూమి తమదంటూ ఇటీవల కడ్డీలు ఏర్పాటు చేశారు. స్థానికంగా ఈ విషయం వివాదాస్పదంగా మారింది. ఈ అంశంపై జిల్లా అధికారులు స్పందించి సర్వే నిర్వహించి సమస్యను పరిష్కారించాలని కోరారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఆర్డీఓ అశోక్ చక్రవర్తి

కల్హేర్(నారాయణఖేడ్): రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి తెలిపారు. సోమవారం మండలంలోని మహదేవుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం తూకంలో అధికంగా తరుగు తీసుకుంటే తమ దృష్టికి తేవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశ్రీనివాస్, ఆర్ఐ మల్లేశం, మాజీ సర్పంచ్ గోపాల్, కాంగ్రెస్ నాయకులు తుకరాం, వీర్‌షెట్టి, నాగయ్య పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సంగారెడ్డి టౌన్: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ భవన్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్పటికీ కొనుగోలు ప్రారంభించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కల్హేర్: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

సకాలంలో పూర్తి చేయండి

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి మండలంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. జిన్నారం మండలంలోని ఊట్ల, సోలక్‌పల్లి, జిన్నారం ధాన్యం కేంద్రాలను తహసీల్దార్ భిక్షపతి తనిఖీ చేశారు. కొత్త మిషన్లలో పరిశీలించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

గుమ్మడిదల మండలంలో...

గుమ్మడిదల మండలంలో పీఏసీఎస్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గంగాభవాని తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

జహీరాబాద్: కులగణనతో పాటు సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఉపాధి అంశాలపై సర్వే చేసేందుకు ఎంపిక చేసిన ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 91 మంది ఎన్యూమరేటర్లు, 9 మంది సూపర్‌వైజర్లు శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. సర్వేలో భాగంగా అనుసరించాల్సిన విధానాన్ని అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భిక్షపతి, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, ఎంఈఓ బస్వరాజ్ పాల్గొన్నారు.

సర్వేను సకాలంలో పూర్తి చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే బృందాలకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. సర్వేను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. సర్వే చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు.



రామచంద్రాపురం: మాట్లాడుతున్న సంగారెడ్డి

సర్వేపై శిక్షణ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండల కేంద్రాల్లో సోమవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు మల్సూర్, రమేష్‌బాబు, తహసీల్దార్ ఉమ శంకర్, ఎంఈఓలు నాగరం శ్రీనివాస్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లోని 79 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 16 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులకు మంజూరయిన చెక్కులు ఆపేసి, ఇబ్బందులు పెట్టారని విమర్శించారు. తాను గెలిచాక తిరిగి నష్టపోయిన వారికి చెక్కులు ఇప్పించానని గుర్తు చేశారు. వివాహమైన ఆరునెలలలోపే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌పాటిల్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, నాయకులు గుండేరావు, ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, దోండేరావు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

నాగల్‌గిద్ద మండలంలోని పూసల్‌పాడ్ చౌరస్తాలో విజయపత్తి మిల్లులో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు.

ఛట్ పూజలకు ఏర్పాట్లు

పటాన్‌చెరు టౌన్: యూపీ, బిహార్ రాష్ట్రాల ప్రజలు జరుపుకునే ఛట్ పూజకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం సాకి చెరువును సందర్శించి మాట్లాడారు. 7, 8 తేదీల్లో నిర్వహించే ఛట్ పూజకు సాకి చెరువు వద్ద విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని తెలిపారు.

అన్ని వసతులు కల్పిస్తున్నాం..

కల్హేర్(నారాయణఖేడ్): హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని కల్హేర్ ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ కిషన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలకు డబ్బులు అందజేశారు. ప్రభుత్వం కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచిందని తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వసతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం శైలజ కులకర్ణి పాల్గొన్నారు.

భూగర్భ జల పరిరక్షణపై అవగాహన

సంగారెడ్డి టౌన్: భూగర్భజలాలు పెంచే నీటి జాగ్రత్తలు పాటించాలని భూగర్భజల శాఖ హైడ్రాలజిస్ట్ డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పసల్వాదిలోని ప్రభుత్వ పాఠశాలలో విజన్ సంస్థ వారి సహకారంతో భూగర్భ జల పరిరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. నీటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విజన్ సంస్థ డైరెక్టర్ కైలాష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని వర్షం ద్వారా వచ్చే నీటిని వడిసిపెట్టి ఇంకింపజేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన , డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, మండల విద్యాధికారి విద్యాసాగర్, గ్రామపంచాయతీ సెక్రటరీ, విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అధికారులకు సన్మానం



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

రాయికోడ్(అందోల్): రాయికోడ్, వట్‌పల్లి మండలాల్లో ఏఓలుగా విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్లిన అభినాష్ వర్మ, మహేష్ చౌహాన్, స్వాతి, సుమలతలను ఏడీఏ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది శాలువా, పూలమాలలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వారి సేవాలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఈఓలు, ఆత్మ సిబ్బంది, ఫర్టిలైజర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు జమ చేయాలని మున్సిపల్ కాంట్రాక్టర్ కార్మికులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి, కార్మిక యూనియన్ నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ డబ్బుల గురించి మున్సిపల్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పీఎఫ్ విత్‌డ్రా సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనియెడల ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. ధర్నాలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక యూనియన్ నాయకులు కామయ్య, శ్రీనివాస్, యశోద, మోహన్, చంటి, కాంతమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

జిల్లాలోని ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మాజీ సర్పంచుల రాష్ట్రస్థాయి ఫోరం ధర్నాకు పిలుపునిచ్చింది. దీంతో పోలీసులు జిల్లా వ్యాప్తంగా ముందస్తు అరెస్టులు చేసింది. వీరికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.



సదాశివపేటలో..



హత్నూరలో..



నారాయణఖేడ్‌లో..

నూతన గ్రంథాలయాలు ఏర్పాటు చేయండి

నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు: మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులైన చిలుమల సుహాసినిరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ పాల్గొన్నారు. సోమవారం మెదక్‌లో జరిగిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. మధు మాట్లాడుతూ.. గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సుహాసినిరెడ్డి జిల్లా పరిధిలోని గ్రామాల్లో నూతన గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డి మెదక్ డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు ,మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.



చైర్మన్‌కు మొక్కను అందజేస్తున్న మధు

అధికారుల తీరుపై కౌన్సిలర్ ధ్వజం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలోని అంతర్గత మురుగు నీటి కాల్వల నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగడం లేదని స్థానిక వార్డు కౌన్సిలర్ గోపాలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నిధులు కేటాయించినా పనులు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి పనులపై అధికారులు మొద్దు నిద్ర వీడాలని మండిపడ్డారు. తక్షణమే పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో కాలనీవాసులతో ఆందోళన చేపడతామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 24 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లాకోర్టు జరిమానా, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 24 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా 24 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ సీసీరోడ్డు పనుల పరిశీలన

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా, సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ మాజీ సర్పంచ్‌ల అరెస్టు సరికాదు

జహీరాబాద్: మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడాన్ని సోమవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు ఖండించారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న వారిని ముందస్తు అరెస్టు చేయడం తగదన్నారు. మాజీ సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాక అనేక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. వారి బాధలు చెప్పుకునేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు.

◆ మాజీ సర్పంచ్‌ల అరెస్టు అప్రజాస్వామికం



సంగారెడ్డి: పెండింగ్ బిల్లు విడుదల చేయాలని చలో హైదరాబాద్ పోరుబాటకు వెళ్తున్న మాజీ సర్పంచులను అక్రమ నిర్బంధాలు, అరెస్టు చేయడం తగదని ఎమ్మెల్యే ప్రభాకర్ ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సీఎంను కలసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్ వస్తున్న సర్పంచులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

◆ లంబాడ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి రూరల్: లంబాడీల అభివృద్ధికి ప్రత్యేకంగా డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీ కులస్తులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు గిరిజనలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని వాపోయారు. జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీలు గిరిజన లంబాడాలకు సీట్లు కేటాయించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో కూడా గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వకపోతే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు మాజీ సర్పంచ్ పాండ్య నాయక్, మాజీ ఉపసర్పంచ్ నామునాయక్, రూప్ సింగ్, జైసింగ్, రాజు, శీను, బాల్ రాజ్,రంగలాల్, అనిల్, గణేష్ పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నారాయణఖేడ్: పెద్దశంకరంపేట మండలం శివ్వాయపల్లికి చెందిన సాయిలుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.33 వేల చెక్కును సోమవారం నిజాంపేట్‌లో ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అందజేశారు. మూసాపేట్‌కు చెందిన మహిళా రైతు చాకలిమొగులమ్మ ఇటీవల మృతి చెందగా రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షలకు సంబంధించిన ఓచర్‌ను నామినిగా ఉన్న ఆమె కుమారుడు మహిపాల్‌కు అందజేశారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు యాదుల్లా, మల్లేష్, అంజయ్య పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ సింధు అన్నారు. సోమవారం ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉప కమిషనర్ సురేష్, వివిధ శాఖ అధికారులతో కలిసిపరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు బజార్, బొంబాయికాలనీలో జరుగుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎల్ఐజీ, బీడీఎల్ కాలనీ రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని పలువురు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. సమస్యను పరిష్కారించాలని అధికారులకు తెలిపారు.

◆ శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతలను గ్రామానికి చెందిన శ్రీనివాస్ శ్రమదానంతో మట్టిపోసి చదును చేయించారు. 65వ జాతీయ రహదారి నుంచి బూచినెల్లి గ్రామం వరకు గల పంచాయతీరాజ్ రోడ్డు అధ్వానంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. మరమ్మతుల కోసం గ్రామస్తులు అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు మరమ్మతులకు రూ. 2 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. ప్రభుత్వం మారడంతో నిధులు రద్దు అయ్యాయి. రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నెల 2న మండలంలోని హోతి(బి) గ్రామానికి చెందిన ఆటో బూచినెల్లికి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలిసి చలించిన శ్రీనివాస్ సొంత డబ్బులతో మట్టిని పోయించి రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

◆ లింగ బలిజగా నమోదు చేయాలి

మునిపల్లి(అందోల్): వీరశైవ లింగాయత్‌లను లింగ బలిజగా గుర్తించి నమోదు చేయాలని వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్ కోరారు. సోమవారం మండలంలోని బుదేరా ఎల్లలింగ ఆశ్రమంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేలో వీరశైవ లింగాయత్ లింగ బలిజలకు రకరకాల పేర్లు ఉన్నాయని గుర్తు చేశారు. లింగబలిజ, బలిజ వంటి వివిధ రకాల పేర్లు ఉండడం వల్ల వీరశైవ లింగాయత్‌లు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా విద్యా, ఉపాధి రంగాల్లో నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధ్యక్షుడు శివశర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శి రాకేశ్, జీహెచ్ఎంసీ కోశాధికారి పరమేష్, సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు ధనంజయ్య, అధ్యక్షుడు పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.